నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | అక్టోబర్ 15, 2024 | www.navatelangana.com

విద్యుత్‌శాఖలో డీఈలు బదిలీ

- ఆర్మూర్ డీఈగా పీవి రాజేశ్వర్‌రావు.. సీహెచ్ హరిచంద్ నిర్మల్‌కు బదిలీ

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

విద్యుత్‌శాఖలో పలువురు డీఈలను బదిలీ చేస్తూ టీఎస్ఎన్‌పీడీసీఎల్ కర్నాటి వరుణ్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పది మంది డీఈలు బదిలీ అయ్యారు. దీంట్లో భాగంగా నిజామాబాద్ డీఈఈ/ఎంఆర్‌టీ రాజేశ్వర్‌రావును ఆర్మూర్‌కు బదిలీ చేయగా.. అక్కడ డీఈఈ/ఆపరేషన్ విధులు నిర్వహిస్తున్న సీహెచ్ హరిచంద్‌ను నిర్మల్‌కు డీఈ/ఎంఆర్‌టీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా బదిలీ అయిన వారు వెంటనే రిలీవ్ అయి చార్జ్ తీసుకోవాలని సూచించారు. బదిలీల్లో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండబోవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గోసంగికుక్కల్లారా.. మీ ప్రాణం మా చేతుల్లోనే


పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళలు

- బతుకమ్మ పండుగ రోజు దుర్భాషలాడారని గోసంగుల ఫిర్యాదు

నవతెలంగాణ-బాల్కొండ

'గోసంగి కుక్కల్లారా.. ఎంగిలి ఆకుల మీద మెతుకులు ఏరుకొని తిరే వారు. మీరు మా ఊర్లో ఉండటంతో బస్సాపూర్ గ్రామాన్ని గోసంగి బిచ్చగాళ్ల గ్రామం అంటున్నారని' తిడుతూ బూతు పదాలతో దూషించారని గోసంగి సామాజిక వర్గానికి చెందిన సభ్యులు సోమవారం బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమను దూషించి, దాడి చేసిన మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

వివరాలు మెయిన్‌లో..

ఆగిన ఎన్ఎస్ఎఫ్ కార్మికుడి గుండె

- ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి
- పెండింగ్‌లో ఉన్న వేతనాలైనా చెల్లించండి : సీఐటీయూ

నవతెలంగాణ-బోధన్


కేశవ్(ఫైల్)

నిజామాబాద్ జిల్లా బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలో పనిచేసిన మరో కార్మికుడి గుండె ఆగింది. కార్మికుడిగా విధులు నిర్వహించిన కేశవ్ (42) అనే కార్మికుడు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమా రుడు ఉన్నారు. ఆయనపై ఆధారపడి తల్లి ఉంది. ఫ్యాక్టరీ మూతపడటంతో ఎక్కడ ఉపాధి లభించక ఆర్థిక ఇబ్బందు లతో తీవ్ర మనస్థాపానికి గురైనట్టు కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు కుమారస్వామి తెలిపారు. పండగ చేసుకునేందుకు సైతం డబ్బులు లేక తీవ్ర మనోవేదనకు గురై గుండె పోటుతో మృతి చెందినట్టు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సకాలంలో ఫ్యాక్టరీని తెరిపించేలా కృషి చేయాలని కోరారు. అప్పటి వరకు కార్మికులకు కనీసం పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, దినసరి వేతన కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. కార్మికుని మృతికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించి న్యాయం చేయాలన్నారు. మృతుని కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గుడిసెలేని నియోజకవర్గమే లక్ష్యం

- అధికారులు, ప్రజాప్రతినిధులు టీమ్‌వర్క్‌గా పనిచేస్తేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం
- పీహెచ్‌సీ భవనం శంకుస్థాపనలో ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్


మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గుడిసెలు లేని నియోజకవర్గమే లక్ష్యంగా పేదలను, అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్ల మంజూరుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు టీమ్‌వర్క్‌గా పని చేయాలని అప్పుడే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్తాయని, అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సోమవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సి) భవనం నిర్మాణం కోసం ఒక్క కోటి 43 లక్షల రూపాయలతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామాల్లో రూ.7 లక్షలతో సిసి రోడ్డు, మండల సమీకృత భవన నిర్మాణం కోసం మరో 13 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ నిర్మాణ శంకుస్థాపనతో నసురుల్లాబాద్ మండల వాసుల 42 ఏండ్ల కల.. నేటితో నెరవేరినట్టయిందని అన్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటికే 11 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేశామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హయాంలో ఇల్లు లేని నియోజక వర్గం కావాలన్నారు. ఇందిరమ్మ పథకం కింద ప్రతి ఒక్కరికీ 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు టీమ్ వర్క్‌గా అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న వారిని గుర్తించి ఇండ్లను మంజూరు చేయాలని చెప్పారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి, శిథిలావస్థలో ఇండ్లున్న వారికి ఇండ్ల మంజూరులో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాలు లబ్ది చేకూరిన వారికి తదుపరి ఇండ్లను కేటాయించాలనీ చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా మూడు లక్షలు ఇవ్వగా మరికొన్ని డబ్బులు వేసి లబ్ధిదారులు ప్రభుత్వ ఇల్లు నిర్మించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజు నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, నాయకులు కంది మల్లేష్, మైషగౌడ్, కలిల్, మజీద్, యూసుఫ్, ఇక్బాల్, రాము, ప్రతాప్ సింగ్, శ్యామల, వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి. అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీకి శంకుస్థాపన చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ధాన్యం సేకరణకు సర్వం సిద్ధం

- కొనుగోలుకు 419 కేంద్రాలు
- 6.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- 153 రైస్‌మిల్లుల కేటాయింపు పూర్తి
- కల్లాలు లేక రోడ్లమీద పంట ఆరబోత
- సకాలంలో సేకరిస్తే రైతులకు, వాహనదారులకు మేలు

నవతెలంగాణ-లింగంపేట్


కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కోతలు ఊపందుకున్నాయి. బోరుబావుల మీద ఆధారపడి సాగు చేసిన వారి పంటలు కోతకు రావడంతో ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. కాగా ఇది వరకే కోతలు పూర్తి చేసుకున్న రైతులు.. ధాన్యాన్ని సెంటర్‌లకు తరలిస్తున్నారు. కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నారు. కాగా ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు లేక రోడ్లను ఆశ్రయించాల్సి వస్తుంది. అయితే జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 419 కేంద్రాలు ప్రారంభించ నున్నట్టు అధికారులు తెలిపారు. 6.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా మొత్తంగా 153 రైస్‌మిల్లులను కేటాయించినట్టు పేర్కొంటున్నారు.


కల్లాలు లేక రోడ్డుకు ఇరువైపులా ధాన్యం ఆరబోత

బతుకమ్మ, దసరా పండుగలు పూర్తికావడంతో రైతులు వరి కోతలపై దృష్టి పెట్టారు. ముందస్తుగా వరినాట్లు వేసిన వారు వరి కోతలు ప్రారంభిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్ నిజాంసాగర్ మండలాల్లో కోతలు ప్రారంభమైయ్యాయి.

ఖరీఫ్ సీజన్‌లో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2.89 లక్ష ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని అంచనా వేయగా.. అంతకు మించి మూడు లక్షల 20వేల ఎకరాల్లో వరి పంట సాగయినట్టు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా బోర్ బావుల వద్ద ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వరి నాట్లు వేసిన వారు వరి కోతులు ప్రారంభించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తున్నారు. కాగా కేంద్రాల వద్ద స్థలం లేకపోవడంతో రోడ్లకు ఇరువైపులా ధాన్యం ఆరబెడుతున్నారు. దీంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో పూర్తిగా జాప్యం చేయడం వలన దాన్యం ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడంతో రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. రాత్రి వేళలో ధాన్యం వద్ద కాపలగా ఉండాలంటే విష పురుగులు సంచరించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి 15 రోజులు అవుతున్న కొనుగోలు ప్రారంభించకపోవడంతో వాతావరణంలో మార్పుల వల్ల వర్షాలు సంభవించి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయి అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపులు పూర్తి.. కొనుగోలు ఆలస్యం

జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభం కావడంతో ఇప్పటికే రైతులు కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు సిద్ధం చేశారు. ప్రస్తుతం సీజన్లో 6.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణగా లక్ష్యం పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు. సేకరించిన ధాన్యం రైస్ మిల్లల్లో తరలించేలా సకాలంలో అన్‌లోడ్ చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ధాన్యం రవాణకు లారీల కొరత లేకుండా ట్రాన్స్‌పోర్ట్ పెంచుతున్నట్టు తెలిపారు.

రైస్ మిల్లర్ల కేటాయింపు

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి ఇబ్బందులేకుండా రైస్ మిల్లర్లకు తరలించేలా ప్రస్తుతం జిల్లాలో 153 రైస్‌మిల్లులను కేటాయించినట్టు అధికారులు తెలిపారు. కొనుగోలు సజావుగా సాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయొద్దని ఇది వరకే జిల్లా కలెక్టర్ మిల్లర్లతో పాటు వ్యవసాయ శాఖ అధికారులకు, మార్కెటింగ్, రవాణా సహకార పౌరసరపాల శాఖ అధికారులతో సమావేశంలో పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

గత ఖరీఫ్ సీజన్లో ఈపాటికి కేంద్రాలను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు ఉన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు నానా తంతాలు పడుతున్నారు.

నేటి నుంచి ప్రారంభిస్తున్నాం

రాజేందర్. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

నేటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కోతలు ఎక్కడ పూర్తయ్యాయో అక్కడ ప్రారంభించాలని ఇది వరకే ఆదేశాలు జారీ చేశాం. గన్నీ బ్యాగులు సరఫరా చేస్తున్నాం. ఇది వరకే కొన్ని పంపాం.

కొనుగోలు కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు సమకూర్చాలి

కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, వ్యవసాయం, పాక్స్, తదితర శాఖల అధికారులతో వరి కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండు, మూడు రోజుల్లో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పూర్తవనుందని, కొనుగోళ్లు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ల్లాలో 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందులో 392 వ్యవసాయ పరపతి సంఘం (పాక్స్), 27 ఐ.కే.పి. కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన తేమ కొలిచే యంత్రం, టార్పాలిన్, గాని సంచులు, ఫ్లెక్సీ, తాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సి.ఎం.ఆర్. సేకరణ పూర్తి చేయాలని, మిలర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, జిల్లా సహకార అధికారి, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

- మార్కెట్ యార్డు సందర్శించిన జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు

నవతెలంగాణ-మద్నూర్


ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రైతు లు పండించిన సోయా పంటను దళారులకు తక్కువ ధరలకు అమ్ము కొని మోస పోవద్దని ప్రభుత్వ పరంగా ప్రారంభి ంచిన కొనుగోలు కేంద్రం లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సూచించారు. మద్నూర్ మార్కెట్ యార్డును ఎమెల్యే సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రైతులు ఆరబెట్టిన సోయా పంటను పరిశీలించి అక్కడ ఉన్న రైతులతో మాట్లాడారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ అధికారులు, పార్టీ మండల అధ్యక్షులు దరాస్ సాయిలు, నాయకులు రామ్ పటేల్, హనుమాన్లు, స్వామి, విట్టల్, వట్నాల రమేష్, మాజీ జెడ్పిటిసి సాహెబ్ రావు పాల్గొన్నారు.

వచ్చేనెల నుంచి పత్తి కొనుగోళ్లు

- మద్దతు ధర క్వింటాకు రూ.7521

నవతెలంగాణ-కామారెడ్డి


పత్తికొనుగోలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

వచ్చే నెల నవంబర్ మొదటి వారంలో జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించుటకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం రోజున కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోళు ప్రారంభించనున్నట్టు తెలిపారు. పత్తి క్వింటాలుకు సిసిఐ కనీస మద్దతు ధర రూ. 7,521/- లుగా నిర్ణయించినట్టు తెలిపారు. వ్యవసాయ అధికారుల సమాచారం మేరకు జిల్లాలో సుమారు 2.36 లక్షల క్వింటాళ్ల పత్తి సేకరణకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు ధర క్వింటాలుకు రూ. 7500/- లకు పైగా ఉన్నట్టు సమాచారం ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో మద్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, కొనుగోళ్లు చేసి ఆ మిల్లులకు పంపించనున్నట్టు సీసీఐ అధికారులు తెలిపారని అన్నారు. ముఖ్యంగా కొనుగోళ్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. గతంలో లాగా తెలుగు, మరాఠీ భాషల్లో రికార్డింగ్ చేసి ప్రచారం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలని మిల్లర్లకు తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన పత్తికి మూడు రోజుల్లో చెల్లింపులు చేయాలని అన్నారు. అనంతరం పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సిసిఐ ఇన్‌చార్జి ఓబుల్ రెడ్డి, డిఎస్పీ , జిల్లా ఫైర్ అధికారి, తూనికలు కొలతల అధికారి, ఆర్డీవో, వివిధ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీజే నిర్వహకులపై కేసు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సుప్రీంకోర్టు నిషేధించిన డీజేలను వాడొద్దని వాటితో వృద్ధులకు పిల్లలకు, రోగగ్రస్తులకు హాని కలుగుతుందని తెలిసి కూడా డీజేలను పెట్టి ఇబ్బంది కలిగించిన ముగ్గురి డీజే యజమానులు ఆకుల సంపత్ , నవీన్ , ఆదిత్య పై కేసు నమోదు చేసినట్టు రెండో టౌన్ ఎస్‌హెచ్‌వో సోమవారం తెలిపారు. డీజేలను సైతం సీజ్ చేసినట్టు తెలిపారు. డీజేలతో చాలా ఇబ్బందులు ఎదురవు తున్నాయని సూచించినా పట్టించుకోకపోవడంతో వారిపై కేసు నమోదుచేసి డీజేలను సీజ్ చేసినట్టు తెలిపారు.

ముగిసిన దసరా సెలవులు

- తిరుగు ప్రయాణం అయిన విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్


బస్టాండ్‌లో బస్ ఎక్కుతున్న ప్రయాణికులు

దసరా సెలవులు సోమవారంతో ముగియడంతో సొంతూర్లకు వచ్చిన వారు తిరుగుప్రయాణమైయ్యారు. దీంతో బస్టాండ్ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మంగళ వారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. పండగ సెలవుల కోసం సొంతూళ్లకు వచ్చిన విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజలు, తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ప్రయాణికులతో ఆర్ టి సి బస్టాండ్ లు కిక్కరిసి పోయాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిజామాబాద్ నగర బస్టాండు వెలది వేలా మంది ప్రయాణికులతో కిటకిట లాడింది. ముఖ్యంగా మారు మూల ప్రాంతాలకు పండగల కోసం వెళ్లిన వారంతా సోమవారం ఉదయం నుంచే జిల్లా కేంద్రానికి చేరుకుంటుండడంతో గ్రామాల నుంచి వచ్చే బస్సులు సైతం నిండుగా వస్తున్నాయి.వేలాదిగా హైదారాబాద్ కు తిరుగు ప్రయాణం అవుతున్నవారు ఉన్నారు, కానీ ఆర్టీసీ అధికారులు రద్దీ కి తగ్గట్టుగా అదనపు సర్వీస్ లను ఏర్పాటు చేయలేక పోయారు. దీంతో ప్రయాణికులు బస్సులకోసం బస్టాండు లోనే గంటల తరబడిగా పడిగాపులు కాస్తున్నారు. ఎలాగో అదనపు చార్జీలు ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు అవసరాల మేరకు బస్సు లు సిద్ధం చేయక పోవడం పై ప్రయాణికులు మండిపడుతున్నారు.


బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ప్రజావాణికి 51 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కమిషనర్ మకరంద్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది నాణెం చలామణి అవుతుంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

పది నాణెం మార్కెట్‌లో చలామణి చేసేందుకు ప్రజలు జంకుతున్నారు. దీనంతటికీ కారణం పది రుపాయల నాణెం చెల్లదు అంటూ వచ్చిన పుకార్లు, అప్పటి నుండి మార్కెట్లో పది రూపాయల నాణెంను వ్యాపారస్తులు, ప్రజలు తీసుకోవడం లేదు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రూ. పది నాణెం చెల్లుబాటు అవుతుందని ప్రజలకు అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీస్ సిబ్బంది ప్రజలకు పది నాణెంపై ఉన్న అపోహను తొలగించే విధంగా అవగాహన కల్పించారు. పది నాణెం చలామణి అవుతుందని, ప్రజలు ఇచ్చి పుచ్చుకోవాలని సూచించారు. దీనిపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని కోరారు. కార్యక్రమంలో డిఎం ప్రదీప్,కెనరా బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్లో రోడ్డు ప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
- ఒకరు మృతి



నుజ్జునుజ్జయిన కారు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం చాయి తాగేదుకు వెళ్లే వ్యక్తిని వెనుక నుండి కారు ఢీకొనడంతో మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెర్కిట్‌కు చెందిన సుద్దపల్లి చిన్న గంగాధర్ (55) ఉదయం నాలుగు గంటలకు చాయి తాగేందుకు వెళ్తున్నాడు. ఆ సమయంలో నిర్మల్ వైపు నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న ఓ కారు అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై గంగాధర్ తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-ఆర్మూర్

గాలి కుంటు వ్యాధి పశువులకు సోకకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలో నేటి నుండి ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వనున్నట్టు మండల పశు సంవర్ధక అధికారి లక్కం ప్రభాకర్ సోమవారం తెలిపారు. మంగళవారం మండలంలోని మగ్గిడి గ్రామంలో గాలికుంటు టీకాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అపోహలు వీడి తమ గ్రామాలకు వచ్చే పశువైద్య సిబ్బందితో తమ పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా టీకాలు ఇప్పించుకోవాలని కోరారు.

పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని యుఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దల నాగరాజు మాట్లాడుతూ.. ప్రైవేటు కాలేజీలలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంలో పడేసే రకంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. అందుకు నిదర్శనం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడమేనని అన్నారు. అధికారంలోకి వస్తే విద్యారంగానికి బడ్జెట్లో పెద్దపీట వేస్తామని చెప్పి తీరా విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లుతుందని అన్నారు. ఆరేడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ సరైన సమయంలో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత పైతరగతులకు లేదా ఉద్యోగాల కోసం వెళ్లినప్పుడు సర్టిఫికెట్స్ లేక ప్రైవేటు కళాశాలలో ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లిన ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేస్తూ కాలయాపన చేస్తుందని అన్నారు. ఈ మధ్యకాలంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అని నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం అందిస్తామని, దీనికి బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం గతం నుండే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడానికి గల ఆంతర్యం ఏమిటో సర్కారుకే తెలియాలని అన్నారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ కి జీతాలు చెల్లించలేక కాలేజ్ నిర్వహణ చేయుటకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు కళాశాల బందుకు పిలుపునిచ్చారని, దీనికి యూఎస్ఎఫ్ఐ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పోషన ,మహేష్, గణేష్ బోధన్, డివిజన్ అధ్యక్షులు రాజు, జవహర్, డివిజన్ నాయకులు సురేందర్, అఫ్సాన్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి ఐటిఐలో వాక్ ఇన్ అడ్మిషన్లు

- అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి ప్రిన్సిపాల్ కోటిరెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కల్పన శిక్షణ శాఖ, బాల్కొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఐటిఐ కమ్మర్ పల్లి(బషీరాబాద్) లో అడ్వాన్సు టెక్నాలజీ సెంటర్‌లో ఖాళీలు ఉన్నట్లు కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎం. కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 14 నుండి 19 వరకు వాక్ ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటిఐలో న్యూ ఏజ్ కోర్సుల్లో 172 సీట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. సంవత్సర కాల వ్యవధితో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్లో 40సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో 40సీట్లు, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్‌లో 20సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల కాలవ్యవధితో బేసిక్ డిసిగ్నేర్మా మరియు వర్చువల్ వెరిఫైయర్ (మెకానిక్)లో 24సీట్లు, అడ్వాన్సుడ్ సిఎన్‌సి మెషినింగ్ టెక్నీషియన్‌లో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్‌లో 24సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రాంత వాసులు, పదవ తరగతి పాసైన బాలబాలికలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు 16 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని, అడ్మిషన్లకు వయోపరిమితులు లేదని తెలిపారు. కోర్సుల వివరాల కోసం, విద్యార్థులకు www.iti.telangana.gov. in లో చూడాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న వారికి ఈ నెల 14 నుండి 19 వరకు ప్రతిరోజు బషీరాబాద్‌లోని ఐటిఐలో అడ్మిషన్స్ జరుగుతాయని తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలని సూచించారు. వాక్ ఇన్ అడ్మిషన్స్ లో ఎటువంటి రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు. పదవ తరగతి జీపీఏ మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఐటిఐ అడ్వాన్స్ కోర్సులు చదివిన విద్యార్థులకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు తమకు నచ్చిన వివిధ ట్రేడ్స్ సీటు పొందాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9491566890 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

పిసిసి చీఫ్‌ను కలిసిన మండల నాయకులు



నవతెలంగాణ-మోపాల్

టీపీసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను మాజీ ఎంపీపీ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బున్నె రవి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యేను కలిసిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, డయాలసిస్ బాధితులు

- సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి
- ప్రతి నెల రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, డయాలసిస్ బాధితులు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని కలిశారు. సోమవారం వేల్పూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలిసి వారి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కిడ్నీ బాధితులం ప్రజాభవన్‌కు వెళ్లి సమస్యపై వినతి పత్రం ఇచ్చామని, ఎలాంటి స్పందన లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్య, డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను బాధితులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి మా సమస్యని విన్నవిస్తున్నామని ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ అయిన పేషంట్‌లకు ప్రతి నెల మందులకు రూ.10వేలకు పైగా ఖర్చు అవుతుందని, ప్రభుత్వం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, డయాలసిస్ పేషంట్ లకు రూ.10వేలు ప్రతి నెల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో ఎంఎస్ 43 ద్వారా కిడ్నీ బాధితులకు రూ.10 వేలు పెన్షన్ ఇస్తుందని, ఇక్కడ కూడా అలాగే ఇచ్చేలా చూడాలన్నారు. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్, డయాలసిస్ పేషంట్ లు బయట పనులు చేయలేని పరిస్థితి ఉందని వాపోయారు. డయాలసిస్ కోసం వారం వారం, ట్రాన్స్ ప్లాంట్ బాధితులు ప్రతి నెల హాస్పిటల్ చుట్టు తిరగాల్సి వస్తుందన్నారు. కుటుంబ సభ్యులు కూడా మాతోనే దగ్గరుండి చూసుకోవాల్సిన పరిస్థితి ఉన్నందున కుటుంబ పోషణ భారం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం --దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ను కోరారు. సమస్యను తప్పకుండ ప్రభుత్వం --దృష్టికి బీఆర్ఎస్ పార్టీ తీసుకెళుతుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, దయాలసిస్ బాధితులు

పిడిఎస్‌యు అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

పిడిఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ పూర్వ నాయకులు ప్రస్తుత టీపీటీఫ్ జిల్లా నాయకులు పోచన్న అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) డివిజన్ కమిటీ కేంద్రంలోని కార్యాలయంలో అర్ధ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పూర్వ, ప్రస్తుత పిడిఎస్‌యూ నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పిడిఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ అధ్యక్షత వ్యవహరించారు. ఈసందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన పోచన్న మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ శాస్త్రీయమైన విద్యను అందించాలని, అసమానతలు లేని సమాజం నిర్మించాలని, విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడిందని ఆయన అన్నారు. 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమ సమీక్ష, విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవాలని అన్నారు. అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పిడిఎస్‌యూ అర్ధ శతాబ్ద సభను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిడిఎస్‌యూ పూర్వ నాయకులు ఎన్ దాసు మాట్లాడుతూ పిడిఎస్‌యూ విద్యారంగ సమస్యలపైన, శాస్త్రీయ విద్య సాధనకు సమ సమాజ స్థాపన, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం, విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ వస్తుందని తెలిపారు. అర్ధ శతాబ్ద సభ కరపత్రాలను నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమొక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్యశివాజీ, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సాయి రెడ్డి, పీడీఎస్‌యూ, అరుణోదయ పివైఎల్ నాయకులు అబ్దుల్, రవి, సూరిబాబు, బుస్సాపూర్ సాయన్న, గంగాధర్, రాజేష్, కైఫ్, ఫైసల్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఈరవత్రి అనిల్ పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలను సోమవారం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ పరామర్శించారు. హాస కొత్తూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, అడ్వకేట్ ఏలేటి గంగాధర్ అమ్మ గంగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గంగాధర్‌ను, వారి కుటుంబ సభ్యులను ఈరవత్రి అనిల్ పరామర్శించారు. గంగవ్వ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. కమ్మర్‌పల్లిలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల బుచ్చి మల్లయ్యకు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకొని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా గౌరవ అధ్యక్షులు అబ్దుల్ రఫీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఈరవత్రి అనిల్

16న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 16న ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సును నిజామాబాద్ జిల్లాలోని శ్రావ్య గార్డెన్ లో ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు సరికేల పోశెట్టి మాదిగ తెలిపారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టులో ఆమోదించబడ్డ రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు అమలు చేయకపోవడంవల్ల మాదిగ జాతి, ఉప కులాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వము ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సదస్సులో మందకృష్ణ మాదిగ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా వర్గీకరణ చేయకపోతే మందకృష్ణ మాదిగ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ సదస్సుకు 33 జిల్లాల ఎమ్మార్పీ శ్రేణులు, అనుబంధ సంఘాల సభ్యులు విచ్చేస్తున్నారని చెప్పారు. కావున నిజామాబాద్ జిల్లాలోని ఎమ్మార్పీఎస్ శ్రేణులు, అనుబంధ సంఘాల ఉద్యోగస్తులు అధిక మొత్తంలో హాజరై రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మైలారం బాలు, మాదిగ ఉద్యోగస్తుల జాతీయ నాయకులు తెడ్డు గంగారాం మాదిగ, మాదిగ ఉద్యమస్తుల రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ మాదిగ, జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మైలారం గంగాధర్ మారుతి, గద్దల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సహాయకులకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-మోపాల్

మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నీటి సహాయకులకు మంగళవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజులపాటు స్థానిక మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మిషన్ భగీరథ ఏఈ వినయ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా నీటి సహాయకులకు చేతిపంపుల రిపేర్, మోటార్ రిపేర్, ప్యానెల్ బోర్డు రిపేర్, పైప్ లైన్ రిపేర్, నీటి నాణ్యత ప్రమాణాలపైన శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బోధన్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు గాదె సత్యనారాయణ మూర్తి మృతి చాలా బాధాకరమని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ అన్నారు. న్యాయవాదిగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రాక్టీస్ చేస్తు న్యాయసేవలు అందించారని కొనియాడారు. మూర్తి మృతికి సంతాప సూచకంగా బార్ సమావేశపు హల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆదిలాబాద్, మెదక్,నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సర్ సంఘ్ చాలక్‌గా హిందు సమాజ శ్రేయస్సుకు కృషి చేశారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యునిగా న్యాయవాద సమాజానికి అండదండలు అందించారని అన్నారు.1964 లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని సుదీర్ఘ న్యాయప్రస్థానం చేసిన మూర్తి కీర్తి అజరామరమని గౌడ్ పేర్కొన్నారు. మూర్తి మృతికి సంతాపం వ్యక్తం చేస్తు తీర్మానం ఆమోదించి కోర్టు విధులకు దూరంగా ఉన్నట్లు తెలియ జేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, బార్ ఉపాధ్యక్షుడు రాజు,ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి సురేష్ దొన్నల్,కోశాధికారి దీపక్, సీనియర్ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి ఓటరుగా తన పేరు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రులు. నవంబర్ 6వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేయించుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎన్నికల అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్ కుమార్, పట్టభద్రుల పట్టణ కోఆర్డినేటర్ మిర్యాల్ కర్ కిరణ్, పట్టణ ఉపాధ్యక్షులు దోండి ప్రకాష్, ఓబీసీ మోర్చ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- అడిషనల్ డీఎస్పి బస్వా రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

నేటి యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలని అడిషనల్ డిఎస్పి బస్వారెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ రూపొందించిన స్వాతంత్ర్య సమర యోధుల చరిత్ర, తన సోదరుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విక్రమ్ సింహ్ రావు రాసిన మానవత విలువల పుస్తకం సోమవారం వారి ఆఫీస్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం, విద్యార్థులు పుస్తక పఠనం నిత్య జీవితంలో అలవర్చు కోవాలని, సేవ చేసే తత్వాన్ని ఏర్పరచుకోవాలని, పట్వారీ తులసి సేవలు అభినందనీయమని అన్నారు.


జాతీయస్థాయి కథల పోటీల్లో ఏర్గట్ల విద్యార్థికి బహుమతి



నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న కే.అభిలాష్‌కు మాచి రాజు బాలసాహిత్య కళా పీఠం వారు నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల్లో 'మంచి మనసు' అనే కథకు బహుమతి లభించిందని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ సోమవారం తెలిపారు. నవంబర్ 3 వ తేదీన హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో విద్యార్థికి నగదు బహుమతితో పాటు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని అన్నారు. విద్యార్థి అభిలాష్‌ను ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

పిసిసి అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



పిసిసిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార సొసైటీ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా, బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మోహన్ రెడ్డితో కలిసి రాష్ట్ర మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి దసరా, బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోనాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టేకుల జలంధర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ చిన్నోళ్ల రెడ్డి, కొత్తచెరువు తండా లకావత్ సంతోష్ నాయక్, తిప్పిరెడ్డి రమేష్ రెడ్డి, మారంపల్లి హన్మాండ్లు, తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ పోతంగల్ మండల ఎన్నిక



నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని సాయిబాబా ఆలయంలో బాన్సువాడ ఇన్చార్జి కె.పోచిరాం అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా నేరోళ్ళ ఈరయ్య, ఉప అధ్యక్షులుగా వై.గణేష్ (కారేగం), యాదు (కారేగాం), నక్కేవార్ సాయిలు (చేతనగర్), పులి సాయిలు (చేతనానగర్), లాలు (సుంకిని), ప్రధాన కార్యదర్శి మైత్రి సంగయ్య (కొడిచర్ల), ప్రధాన ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ (కారేగామ్), మండల కోశాధికారి గంగారాం (హంగర్గా), మండల కార్యదర్శి జెండా వెంకటి (హెగ్డోలి), మండల మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) అధ్యక్షునిగా నక్కేవార్ హరిదాస్‌ను నియమించారు. వారందరికి అభినందనలు తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వేద ప్రకాష్ పాటిల్ అనారోగ్యంతో ఉన్న విషయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు తెలుసుకొని సోమవారం మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సాయి పటేల్, అలాగే హనుమాన్ స్వామి రామ్‌పటేల్, విట్టల్ గురూజీ తదితరులున్నారు.



మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పంటకోత.. ఆరబోత

- పలుచోట్ల ప్రారంభమైన వరికోతలు
- కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-బోధన్

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం పంట ప్రస్తుతం చేతికి వచ్చింది. గత నాలుగు రోజుల క్రితం నుండి పలుచోట్ల ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. అయితే అనుకోని వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో రైతులు దళారులకు ఆశ్రయించి ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. గత 15 రోజుల క్రితమే ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ప్రస్తుతం ధాన్యం కోతలు కూడా ప్రారంభమయ్యాయి. కానీ అధికారులు ఇంతవరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఒకవైపు కొనుగోలు కేంద్రాలు లేక వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన ధాన్యం రైతులు రహదారులపై ఆరబెడుతున్నారు. అనుకోని వర్షాలు వస్తే రైతుల ధాన్యం తడిసిపోవడంతో వారు ఇబ్బందులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

పడుతున్నారు. అద్దెకు పట్టాలను తీసుకువచ్చి ధాన్యాన్ని రక్షించుకుంటున్నారు. ఈ ఇబ్బందులతో సతమతమవుతున్న రైతన్నలు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గంలో 89,254 ఎకరాలలో వరి సాగు చేసినట్టు ఏ.ఓ సంతోష్ తెలిపారు. బోధన్ మండలంలో 27,446 ఎకరాలలో, ఎడపల్లి మండలంలో 12,877 ఎకరాలలో, రెంజల్ మండలంలో 14,835 ఎకరాలలో, నవీపేట్ మండలంలో 25,713 ఎకరాలలో, సాలూర మండలంలో 8,383 ఎకరాలలో ధాన్యం పండించారు. అలాగే బోధన్ మండలంలో సోయా 7467 ఎకరాలలో, ఎడపల్లి మండలంలో కేవలం వరి మాత్రమే పండించారు. అలాగే రెంజల్ మండలంలో 5342 ఎకరాలలో సోయా, నవీపేట మండలంలో 65 ఎకరాలలో సోయా, సాలూర మండలంలో 5524 ఎకరాలలో సోయా పండించారు. సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రైతులు విక్రయిస్తున్నారు. కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నియోజకవర్గ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇల్లు దగ్ధమైన బాధితులను పరామర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్



ఇల్లును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

అశోక్‌నగర్ 15వ వార్డులో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి విషయం తెలిసిన వెంటనే బాధితులను పరామర్శించారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని అశోక్ నగర్ 15 వ వార్డులో నివాసముంటున్న మహమ్మద్ షబానా కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోవడంతో సోమవారం తెల్లవారుజామున ఆ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ వెంటనే స్పందించి, అధికారులతో మాట్లాడి, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ వనిత రామ్మోహన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ బాధ్యతలు చేపట్టిన సొసైటీ చైర్మన్లు



బాధ్యతలు చేపడుతున్న సొసైటీ చైర్మన్లు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామానికి ఇంచార్జ్ సొసైటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన కిష్టాగౌడ్, బస్వాపూర్ గ్రామానికి ఇంచార్జ్ సొసైటీ చైర్మన్‌గా ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ నియమించి నియామక పత్రాలను అందించిన విషయం తెలిసిందే. సోమవారం ఆయా సొసైటీ కార్యాలయాలలో ఇన్చార్జి సొసైటీ చైర్మన్‌లు పదవి బాధ్యతలు చేపట్టారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని చైర్మన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, సీఈవో మహేశ్వరి, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన వీరన్న గుట్ట కాంగ్రెస్ నాయకులు



గ్రంథాలయ చైర్మన్‌కు పుష్పగుచ్ఛ అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్


నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలను చేపట్టిన అంతిరెడ్డి రాజిరెడ్డిని సోమవారం వీరన్నగుట్ట కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు లచేవారు నితిన్, మాజీ సర్పంచ్ వినోద్, ధరం వీర్, ఎత్తారి సాయిలు, దండుగుల రాజన్న గుంజే రాజు, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యాన్ని సోమవారం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వరి కోతలు ప్రారంభం



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మోడేగాం గ్రామంలో సోమవారం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘం అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కోసం స్థలాన్ని చదును చేయించారు.

జీవిత బీమా సంస్థకు ఏజెంట్లు మూల స్తంభాలు

నవతెలంగాణ-రామారెడ్డి

జీవిత బీమా సంస్థకు ఏజెంట్లు మూల స్తంభాలని లియఫి నాయకులు అన్నారు. సోమవారం నూతనంగా ఆవిష్కరించిన పాలసీలలోని ఏజెంట్ల బెనిఫిట్‌లను, కమీషన్లపై ఆంక్షలు విధించడంపై లిఎఫ్‌సి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్‌లో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఏజెంట్లు నినాదాలు చేశారు. ఏజెంట్లపై కార్పొరేషన్ చేపట్టిన నూతన విధానాన్ని రద్దుచేసి, పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మోహన్, క్లియ నాయకులు రాజిరెడ్డి, బ్రాంచ్ అధ్యక్షులు కదం నారాయణరావు, కార్యదర్శి ప్రదీప్ జైన్, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో సిద్దయ్య అనాథ అనే వ్యక్తి మరణించడంతో గ్రామ మాజీ సర్పంచ్ రాములు అంత్యక్రియల కొరకు రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తిరుమల స్వామి, రాములు, యాదగిరి, సత్యగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, సిద్ధ రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి

సత్వర చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ సమస్యలపై దరఖాస్తు దారుల అర్జీలను కలెక్టర్ సేకరించి, ఆయా దరఖాస్తులను పరిశీలించి తగు చర్య నిమిత్తం సంబంధిత అధికారులను అందజేశారు. ప్రజావాణి అనంతరం ఇందిరమ్మ కమిటీలు, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్, ధాన్యం సేకరణ అంశాలపై అధికారులకు కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. గ్రామ స్థాయిలో, మున్సిపల్ వార్డ్‌స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆ కమిటీల వివరాలు తెలుపుతూ సంతకం చేసిన జాబితాలు సమర్పించాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల మేరకు సర్వే టీమ్‌లు ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే త్వరితగతిన చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలన చేయాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని వివరించారు. జిల్లా వ్యాప్తంగా గత వారం వరకు 18,182 అర్జీలను రాగా వాటిని పరిశీలించి సంబంధిత అధికారులు 17,455 అర్జీలను పరిశీలించి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అశిష్ సాంగ్వాన్

చర్యలు తీసుకున్నారని, మిగతా 727 అర్జీలలో 533 పెండింగులో ఉన్నాయని, 194 దరఖాస్తులు ఇతర శాఖలకు చెందినవి కాగా వాటిని ఆయా శాఖలకు బదిలీ చేశారని తెలిపారు. సోమవారం 49 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆయా కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత మండల, జిల్లా స్థాయి అధికారులు పరిశీలించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సి.ఈ.ఓ. చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మవాగు వద్ద వరి ధాన్యం లారీ బోల్తా

- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ప్రాణ నష్టం
- వాగులో పడిన ధాన్యం బస్తాలు



బోల్తా పడ్డ వరిధాన్యం లారీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గంగమ్మ వాగు వద్ద వరి ధాన్యం లారీ బోల్తా పడిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగమ్మ వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు, భారీ వర్షాలకు ధ్వంసం కావడంతో రెండుసార్లు తాత్కాలికంగా స్థానికులు రోడ్డు నిర్మించారు. భారీ వాహనాలు వెళ్లకూడదని గతంలోనే పోలీసులు, స్థానికులు సూచించినా.. సోమవారం సిరికొండ మండలం నుండి కామారెడ్డి వైపు వస్తున్న వరి ధాన్యం లారీ వాగు వద్ద గల తాత్కాలిక రోడ్డు నుంచి వెళ్తుండగా.. రోడ్డు ఒక సైడు కుంగటంతో లారీ బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తతో ప్రాణ నష్టం జరగలేదు. లారీలో ఉన్న వరి ధాన్యం వాగులో పడటంతో, మరో లారీని తెప్పించి ధాన్యాన్ని తరలించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

నవతెలంగాణ-సదాశివపగర్

విద్యార్థులు చదువును బలవంతంగా భావించకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మార బాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిర్మన్‌పల్లిలో పదవ తరగతిలో నారెడ్డి యశ్వంత్‌రెడ్డి, పైడి శ్రీహర్ష ఇంటర్‌లో గరికె వైష్ణవి, నారెడ్డి నరేందర్ రెడ్డిలకు నగదు పారితోషికం మెమెంటోలతో సత్కరించారు. బాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రచించుకొని ముందుకు సాగాలని గమ్యం చేరే సమయంలో ఒడిదొడుకులు సహజమని ఒత్తిళ్లకు లోనవ్వకుండా ఒడిదొడుకులు



విద్యార్థులను మెమెంటోలతో సన్మానించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు

తట్టుకొని ముందుకు సాగాలన్నారు. సమాజంలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార భైరవరెడ్డి, బాల్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఆరే మధుసూదన్‌రావు, మాజీ సర్పంచ్ ముదుపు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భైరవ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రసాద్, రమేష్‌రెడ్డి, జిన్న అశోక్, నారెడ్డి బాల్‌రెడ్డి, సుద్దపెల్లి సాయిలు, కావేటి సాయిలు, పైడి బాల్‌రెడ్డి, నారాయణ, భాస్కర్‌రెడ్డి, నర్సారెడ్డి, లింగారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసి వైస్ చైర్మన్‌ను సన్మానించిన స్నేహితులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన పాపనోళ్ల స్వామి ఇటీవల కాలంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్వామిని 1999-2000 పదవ తరగతి స్నేహితులు, అలాగే రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందిన తిరుపతిరెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

నిజామాబాద్ డిసిసిబి వైస్ చైర్మన్

పదవిని ఎస్సీలకే ఇవ్వాలి

- దళిత సంఘాల నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని డిసిసిబి చైర్మన్‌గా ఉన్న భాస్కర్ రెడ్డిపై అవిశ్వాసం పెట్టి రమేష్‌రెడ్డి అనే రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఉమ్మడి జిల్లా చైర్మన్ పదవి ఇచ్చారని దళిత సంఘాల నాయకులు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంతకుముందు ఖాళీగా ఉన్న డీసీఎంఎస్ చైర్మన్, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తారాచంద్‌ను నియమించారని తెలిపారు. ఐడీసీఎంఎస్ వైస్‌చైర్మన్‌గా రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఇంద్రసేన నారెడ్డిని నియమించారు. నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డీసీఎంఎస్ చైర్మన్‌ను ఇంతవరకు ఎస్సీని నియమించక పోవడం ఎస్సీల పట్ల రాజకీయ పార్టీలు చూపిస్తున్న వివక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసిసిబి వైస్ చైర్మన్‌గా ఒక ఎస్సీని నియమించి ఎస్సీల పట్ల కాంగ్రెస్ వైఖరి నిరూపించుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒకవేళ ఎస్సీలకు కాకుండా రెడ్డి అగ్రవర్ణ వాళ్లకి డిసిసిబి వైస్ చైర్మన్ ఇస్తే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పవలసి వస్తుందని హెచ్చరించారు. ఎస్సీని నియమించకపోతే కాంగ్రెస్ నాయకుల, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని రేపటి ఎన్నికలలో ఎస్సీ వాడలకు ఓట్లు అడగడానికి కూడా రానివ్వమని హెచ్చరిస్తున్నామన్నారు. ఎస్సీల ఓట్లు అవసరం గానీ ఎస్సీలకు పదవులు ఇవ్వడం ఇష్టం లేని నాయకులకు తగిన బుద్ధి చెప్తామన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ విషయంలో ఆలోచించి ఎస్సీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకుల వల్లనే ఎస్సీల పట్ల చిన్నచూపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం, మాదిగ హక్కుల పోరాట సమితి, మాల మహానాడు, దళిత సంఘాలు, బీసీ సంఘాల నాయకులు కోతోళ్ల గంగారాం, కొత్తపల్లి మల్లన్న, సప శివరాం, బీపీఎం విట్టల్, గైని రాజు తదితరులు పాల్గొన్నారు.

పొదల తొలగింపు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని కోమటి చెరువు తండా గ్రామపంచాయతీ పరిధిలోని బొగ్గులకుంట తండా రోడ్డుకిరువైపులా కలిగిఉన్న ముండ్ల పొదలు, పిచ్చిమొక్కలను ట్రాక్టర్ బ్లేడ్ సహాయంతో రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ కార్యదర్శి చందు రాథోడ్ చొరవతో తొలగించినట్లు పంచాయతీ అధికారి బాల్‌రాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గులకుంట తాండ రోడ్డు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో నిండి ఉండడం వల్ల తాండవాసులకు, పశువులకు రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నందున బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో శుభ్రపర్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భవిష్యత్ కార్యాచరణ కోసం బుధవారం 16వ తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు భూమయ్య అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 16వ తేదీన మంద కృష్ణ మాదిగ ఈ సభకు హాజరవుతున్నారని తెలిపారు. కావున ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాల రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శ్రావ్య గార్డెన్ నందు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ద్వారా వర్గీకరణను సాధించిన తర్వాత మొదటిసారి నిజామాబాద్ జిల్లాకు వస్తున్న సందర్భంగా మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకనున్నట్లు పేర్కొన్నారు. ఈ రాష్ట్ర సదస్సును విజయవంతం చేసేందుకు వివిధ గ్రామాల, మండలాల కమిటీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి మాదిగ, ఎమ్మార్పీ సీనియర్ నాయకులు గంధమాల చంద్రయ్య మాదిగ, బోధన్ పట్టణ కార్యదర్శి రవి మాదిగ, ఉపాధ్యక్షులు కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
మంగళవారం | అక్టోబర్ 15, 2024 | www.navatelangana.com

నేటి నుండి ఉచిత గాలి కుంటు వ్యాధి టీకాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ద్వారా నిజామాబాద్ జిల్లాలో ఈనెల 15 నుండి నవంబర్ 14 వరకు ఉచిత జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వి. జగన్నాథ చారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఆవులు, లేగలు, దూడలు, గేదలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకొని తమ గాలి కుంటు వ్యాధి సోకకుండా కాపాడుకొవాలని తెలిపారు. జిల్లాలో సుమారు 2.52 లక్షల పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు 5 వ విడతలో వేసేందుకు ఈ కార్యక్రమము చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఇది వరకే మండలాలవారిగా కావలసిన టికా మందులు, సిరింజిలు సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు.

మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన గురుకుల అభ్యర్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

గురుకుల 1:2 అభ్యర్థులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ను నిజామాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి తొమ్మిది నెలలు కావస్తోందన్నారు. ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, వీరి సమస్యను త్వరగా పరిష్కరించి న్యాయం చేయాలని పై అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం, టిపిసిసి అధ్యక్షులు వినయ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, పండిత్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈ నెల 15 నుంచి నవంబర్ 11 వరకు పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పశువైద్యాధికారి శిరీష సోమవారం తెలిపారు. 15న కొలిప్యాక్, 16న కలిగోట్, 17న చింతలూరు, 18న బ్రాహ్మణపల్లి, 19న తొర్లికొండ, 21న మునిపల్లి, 22న నల్లగుట్ట తండా, 23న లక్ష్మాపూర్, 24వ నారాయణపేట్, 25న అర్గుల్, 26న పుప్పాలపల్లి, 28న మాదాపూర్, 30న గన్యాతాండ, నవంబర్ 1న సికింద్రాపూర్, నవంబర్ 2న కేసుపల్లిలో ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. నవంబర్ 4న పడకల్, నవంబర్ 6న మనోహరాబాద్, నవంబర్ 9న వివేక్ నగర్ తండా, నవంబర్ 11న జక్రాన్‌పల్లి గ్రామాలలో పశువులకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ ఇవ్వనున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు తమ పశువులకు వ్యాక్సినేషన్ ఇప్పించుకోవాలని తెలియజేశారు.

పట్టణంలో కత్తిపోట్ల కలకలం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం సృష్టించింది.. స్థానికుల వివరాల ప్రకారం.. దుర్గామాత శోభాయత్రలో భాగంగా వరుణ్ అనే యువకుడు ఓ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో, ఆ యువతి తనకు కాబోయే భర్తకు సమాచారం ఇచ్చింది. దీంతో ఆ యువకుడు అక్కడకు చేరుకొని ఈవ్ టీజింగ్ చేసిన వరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో స్థానికులు ఆయన్ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. యువకుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టణంలో దోపిడీ దొంగల హల్‌చల్

- నాలుగిళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో దోపిడీ దొంగలు హల్చల్ చేశారు. పట్టణ వ్యాప్తంగా నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రామ్ నగర్‌లోని జడ్పీ బాలుర పాఠశాల సమీపంలోని ఉపాధ్యాయుడు రవికుమార్, రఘునాథ్, మాధవి ఇండ్లతో పాటు మామిడిపల్లి కె.వి.ఆర్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ చేశారు. మాధవి గత శనివారం ఇంటికి తాళం వేసి జిల్లా కేంద్రంలో ఉంటున్న తల్లి గారి ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని రెండు తులాల బంగారు నగలు, 50వేల నగదు ఎత్తుకెళ్లినట్టు వాపోయారు. పక్కనే ఉంటున్న రఘునాథ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కరీంనగర్ వెళ్ళాడు. ఆయన ఇంట్లోంచి రెండు లక్షల నగదు, బంగారు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రవికుమార్ మామిడిపల్లిలోని ఓ ఇంట్లో ఏమి లభించకపోవడంతో విఫలయత్నం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు ఇతర ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్



మండలంలోని మోతే గ్రామానికి చెందిన యువకుడు జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అరుణ్ కుమార్ వివరాల ప్రకారం.. మోతే గ్రామానికి ప్రణయ్ (20) హైదరాబాదులో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామం మోతెకు వచ్చాడు. మృతుడు గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. వైద్యం చేయించినా తగ్గుముఖం పట్టడం లేదన్నారు ఆదివారం రాత్రి అందరూ భోంచేసి తల్లిదండ్రులు ఒక రూమ్‌లో మృతుడు ఒక రూమ్ లో పడుకున్నారు. ప్రణీత్‌కు తన చిన్నతనంలో కడుపులో కణతి రాగా ఆపరేషన్ చేయించారు. అపెండెక్స్ ఆపరేషన్ కూడా అయింది. తరచూ కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. సోమవారం ఉదయం 6 గంటలకు మృతుని తల్లి అనురాధ లోపలికి వెళ్లి చూడగా ప్రణీత్ ఉరి వేసుకొని మృతిచెంది కనిపించాడు. తండ్రి సాయిలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిశారు.ఈమేరకు కేసు నమోదుచేసుకుని విచారణ చేపట్టి మృతదేహ్యానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అదనపు కట్నం కోసం వేధింపులు భరించలేక ఓమహిళ గ్రామ శివారులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రయాన్ పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో సదాశివ నగర్ మండలంలోని దగ్గి గ్రామానికి చెందిన వేముల మనోజ (29)కు డిచ్ పల్లి మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామానికి చెందిన సాయిలుతో వివాహం జరిగింది. వివాహనికి ముందుగానే సాయిలు ఖిల్లా డిచ్‌పల్లి గ్రామం వదిలి చంద్రాయన్ పల్లి గ్రామానికి వచ్చి అద్దె ఇంట్లో ఉండేవారు. సాయిలు డ్రైవర్‌గా పనిచేసేవాడు. వేముల మనోజను తన భర్త సాయిలు అదనపు కట్నం కోసం వేధించడం వల్ల తట్టుకోలేక ఆదివారం రాత్రి7 గంటల సమయంలో చంద్రాయన్ పల్లి గ్రామ శివారులోని పెద్ద పోచమ్మ ఆలయం దగ్గర ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి అన్న మూడెడ్ల సంతోష్ ఫిర్యాదు మేరకు భర్త సాయిలు పై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మర్చూరికి తరలించినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ తెలిపారు.

గౌడ కులస్తుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి

- అభివృద్ధికి పార్టీలు అడ్డు రావొద్దు
- టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్



రేణుక గౌడ సంఘంను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో గౌడ సంఘ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో రేణుక గౌడ సంఘ భవనంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ సంఘ అభివృద్ధి కోసం తన వంతు ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో చర్చించి నిజామాబాద్‌లో గౌడ సంఘం అభివృద్ధి కోసం భవనాల నిర్మాణం కోసం ప్రత్యేక నిధులువెచ్చించి మంజూరు చేయిస్తామని అన్నారు. ఇప్పటికే కొన్ని నిధులు మంజూరు అయ్యాయని మరికొంత అభివృద్ధి కోసం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధులు కేటాయించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రాంతాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు అడ్డుగా మారొద్దని, పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం రాజకీయ పార్టీ నాయకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, శేఖర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ న్యాలం రాజు, డిసిసి అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నూడ చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజిరెడ్డి, మాజీ పిసిసికార్యదర్శి నరాల రత్నాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గుడిసె వాసుల కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

నిజామాబాద్ నగరానికి విచ్చేసిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ఎమ్మెల్సీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్ ఆధ్వర్యంలో అభయ హస్తం కాలనీ, బహుజన కాలనీ గుడిసె వాసుల, అభివృద్ధి కమిటీ తరపున కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అభయ హస్తం కాలనీ అభివృద్ధి కోసం మహమ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని, కరెంటు సౌకర్యం కోసం అభివృద్ధి నిధులు సరిపోనందున, మరిన్ని నిధులను మంజూరు చేసి కరెంటు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు కృషి చేయాలని కోరారు. బహుజన కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. అభయహస్తం కాలనీ, బహుజన కాలనీ గుడిసె వాసుల, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీజేలు వాపస్ ఇవ్వండి

ఏసీపీ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న దేవి మండపాల నిర్వాహకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎసిపి కార్యాలయం ఎదుట సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దుర్గామాత విగ్రహం నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని వివిధ యూత్ సభ్యులు ఆరోపించారు. నిమజ్జన శోభాయాత్రలో పోలీసులు నిబంధనలు పాటించలేదని పలు డీజేలను, అత్యధికంగా లైటింగ్ ఏర్పాటు చేసిన వాటిని పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా కొన్ని నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసినా తరలించారని యూత్ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున ఏసీపీ కార్యాలయానికి తరలివచ్చారు. శోభయాత్రలో భాగంగా ప్రభుత్వ పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి రెండు డీజే బాక్సును ఏర్పాటు చేసిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని నిమజ్జనానికి తీసుకెళ్లాల్సిన దుర్గాదేవి విగ్రహంతో ఏసిపి కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. . డీజే లను ప్రారంభించక ముందే ఎలా తీసుకెళ్తారని వారు ప్రశ్నించారు. పెద్ద ఎత్తున మహిళలు, యువకులు కార్యాలయానికి చేరుకున్నారు. తాము నియమ నిబంధనలకు లోబడి సహకరిస్తున్నామని, కాగా వారు మాత్రం కొందరికి మాత్రమే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. డీజే లను తిరిగి ఇవ్వాలని లేదంటే విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని డిమాండ్ చేయగా ఎస్సైలు గంగాధర్, రాము చేరుకొని సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. డీజేలను అప్పగిస్తేనే వెళ్తామని డిమాండ్ చేయడంతో తిరిగి ఇవ్వగా సభ్యులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో శ్రీ త్రిపుర యూత్ సభ్యులు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కలిగొట గంగాధర్, పట్టణ శాఖ అధ్యక్షుడు ద్యాగఉదయ్ మందుల బాలు, కలిగోట ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమయ వేళలు పాటించని అధికారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధికారులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కార్యాలయం



నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి అధికారులు సరైన సమయానికి రాకపోవడంతో అక్కడికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి తహసీల్దార్ రామేశ్వర్ ఆరోగ్య సమస్య రిత్య సెలవులో ఉన్నారు. కేవలం కిందిస్థాయి ఉద్యోగులు మాత్రమే సమయానికి వస్తున్నారు. ఇక్కడ ఉన్న మిగతా ఉన్నతాధికారులు సమయపాలన పాటించడంలేదని ప్రజలు అంటున్నారు. శని, ఆది వారాలు సెలవు దినాలు కావడంతో సోమవారం కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ కొరకు చాలామంది వచ్చారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుకోసం కూడా యువత ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇప్పటికైనా, ఆర్డీవో ఈ కార్యాలయంపైన ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సర్టిఫికెట్‌లు మంజూరు చేయాలంటే మాత్రం ఏ చిన్న పొరపాటు ఉన్న సర్టిఫికెట్లను రిజెక్ట్ చేస్తున్నారు. అటువంటప్పుడు వారు సరైన సమయపాలన పాటించాలని అంటున్నారు.

భారతీయ పండుగలకు ప్రత్యేక స్థానం

- ఆత్మీయ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మన భారతీయ పండుగలు, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక స్థానం ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం ఎంఎస్ కన్వెన్షన్‌హాల్లో (హొటల్ నిఖిల్ సాయి) ఇంటర్నేషనల్, శ్రీ వ్యాసపురి కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా మూడ నాగభూషణం గుప్తా ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతు కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దసరా పండగను తెలంగాణ ప్రజలు ఎంతో ఘనంగా కుటుంబ సమేతంగా సంతోషంగా చేసుకుంటారని తెలిపారు. నేటి పాశ్చాత్య సంస్కృతికి యువత, చిన్నారులు అలవాటు పడి హిందూధర్మం పండుగలు, సాంప్రదాయాలను మర్చిపోతున్నారన్నారు. వారి తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే తమ పిల్లలకు మన పండుగలు, సాంప్రదాయాలను అలవాటు చేయాలని అప్పుడే పండగల యొక్క ప్రాముఖ్యత వారికి తెలుస్తుందని తెలిపారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్స్ ఉపయోగించడం వలన ఒక్కొక్కరు ఒక్కొక్క రూముకు అలవాటు పడుతున్నారని అందువలన ఒకే దగ్గర ఉన్నప్పటికీ దూరం దూరంగా ఉండి పండగలను జరుపుకుంటున్నారని వివరించారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండి సంతోషంగా పండగలను జరిపి వాటి సంస్కృతిని విలువలను తెలుసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వేదికపై జంబిని ఒకరినొకరు ఇచ్చుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం అతిథులను నాగభూషణం గుప్తా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది టక్కర్ హన్మంతరెడ్డి, లోక భూపతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, ప్రముఖ కవి గంట్యాల ప్రసాద్, న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్, డాక్టర్ కృష్ణమూర్తి సాయిబాబు, సిర్ప లింగం, తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మారగంగారెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో నాఫెడ్ ద్వారా తెలంగాణ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతుధర క్వింటాలుకు రూ.4892 పొందవచ్చని తెలిపారు. సోయాలను విక్రయించే రైతులు వారి వెంట ఆధార్ కార్డ్, పట్టా పాస్ బుక్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను, ఏఈఓ ఇచ్చే ధృవీకరణ పత్రాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, మార్క్ ఫెడ్ డీఎం రంజిత్ రెడ్డి, సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ముప్కాల్

ప్రతి మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న అంగడి బజార్ (సంత) వద్ద ఇక ప్రతి అంగడి రోజు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని లయన్స్ క్లబ్ సభ్యులు కట్ట మహేష్ యాదవ్, కొమ్ముల నర్సయ్య సోమవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. నేడు మధ్యాహ్నం 2గంటల సమయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ప్రారంభించనున్నట్టు చెప్పారు. అవకాశాన్ని మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సద్దుల బతుకమ్మ సంబరాలు



కోనాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలు తీసి చప్పట్లు, కోలాలు, డీజే చప్పుళ్ల పాటల మధ్య కనువిందు చేసే నృత్యాలు చేస్తూ చూసే వారిని ఆకట్టుకున్నారు. అత్తవారి ఇండ్లలో నుండి పుట్టింటికి వచ్చి ఎంతో ఇష్టంగా ఆడే బతుకమ్మ ఆడవాళ్ళ పెద్ద పండుగగా భావించే ఆడ బిడ్డలు వచ్చి బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలతో అలంకరించి పసుపు గౌరమ్మను మధ్యలో నిలిపి కొలిచే ఈ సంప్రదాయం కేవలం తెలంగాణకే సొంతం. మళ్లచ్చే ఏటి వరకు చల్లగా పోయి రా అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మలను నీటిలో వేశారు. అనంతరం వెంట తెచ్చిన సద్దుల ప్రసాదాలు పంచుకొని తింటూ బతుకమ్మ సంబరాలను ముగించారు.

త్రివేణి సంగమం వద్ద నిలకడగా గోదావరి నీటిమట్టం


నీటమునిగిన రాతి శివాలయం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో గోదావరి ప్రవాహం నిలకడగా మారింది. కందకుర్తి గోదావరి ప్రధాన ఘాట్‌ల వద్దనున్న రాతి శివాలయం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. వచ్చే రబీ సీజన్‌కు సరిపోయేంతగా నీరు ఉండడంతో స్థానిక రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం మూడు నదులలో నీరు నిండుకోవడంతో ఆ ప్రాంతం ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి లింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం లింగం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రాణ స్నేహితుడిని కోల్పోవడం బాధాకరమని లింగం కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు బుర్రి గోపాల్, బిక్షపతి, బాలాగౌడ్, చింతలూరి స్వామి ఉన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రోత్సాహకం సైతం ఇస్తున్నట్టు రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజు తెలిపారు. సోమవారం బాన్సువాడ మార్కెట్ కమిటీ యార్డులో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎటువంటి నష్టం జరగకూడదని, రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. వానాకాలం పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన సన్నం రకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోకూడదని తెలిపారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, కామన్ గ్రేడ్ రూ.2300 చెల్లిస్తుందని తేమ 17శాతం లోపు ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ జంగం గంగాధర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి నరేందర్, పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధితోపాటు ఐక్యంగా ఉండండి..

నసురుల్లాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త ప్రజల్లో మమేకమై పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం కావాలని బాన్సువాడ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నేత, రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ.. నసురుల్లాబాద్ మండల కేంద్ర నేతలు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఆ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. నేతలు ఎవరు మండలం ఏర్పాటు కావాలని కోరకపోయినా, మండల సమీకృత సముదాయ భవనం కావాలని అడగకపోయినా, 80 మందికి డబుల్ బెడ్ రూములు కావాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి నసురుల్లాబాద్ గ్రామ అభివృద్ధి కోసం అన్ని సౌకర్యాలు కల్పించినా.. నాయకుల్లో, కార్యకర్తల్లో ఆనందం కరువైందన్నారు. ప్రజలు సంతోషంగానే ఉన్న నాయకుల మధ్య సమన్వయం లోపించిందన్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్గాలుగా ఉండడంతో అభివృద్ధి పనుల్లో ఆటకం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కాంగ్రెస్ పార్టీ పథకాలను, అభివృద్ధి పనులను ఆటంకం కల్గిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. కార్యకర్తలు అందరూ కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉండి కలిసికట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి ఎంత అభివృద్ధి చేసినా గ్రామ నాయకుల్లో సంతోషం లేదన్నారు. నేతల సమన్వయం లోపం ఉండడంతో ప్రజలకు ఎలాంటి సంకేతాలు పోతాయని ఆయన ప్రశ్నించారు. గ్రామ అభివృద్ధి ఎలా అయినా జరుగుతుంది.. మీరు ఐక్యంగా ఉండటానికి ప్రయత్నం చేయండి అని హితవు పలికారు. వీరి వెంట పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పెరిక శ్రీనివాస్, కంది మల్లేష్, మేషగౌడ్, ఖలీల్, వెంకటేశ్వర్లు, యూసుఫ్, ఇక్బాల్ తదితరులున్నారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య



నవతెలంగాణ-రెంజల్

భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలంలోని కండ్గావ్ గ్రామానికి చెందిన మీసాల లక్ష్మణ్ (26) భార్య ఇటీవలే మృతిచెందింది. దీంతో ఆయన తన ఇద్దరు పిల్లలతో ఆటో నడుపుకుంటూ సాటాపూర్ గ్రామంలో తన బావ బైండ్ల గంగాధర్ వద్ద ఉంటున్నాడు. ఆయన భార్య మరణంతో మనస్థాపానికి గురైన లక్ష్మణ్ శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కందకుర్తి గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బావ బైండ్ల గంగాధర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-బిచ్కుంద

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని వాజిద్‌నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి ఎల్లుట్ల సుమలత (36) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సుమలత భర్త సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఒక కొడుకు ఉన్నారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

తన కూతురు కనిపించడం లేదని కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కేంగర్ల మల్లయ్య పట్టణ పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కెంగర్ల నిర్మల (35)కు రెండుసార్లు వివాహమై విడాకులు కావడంతో తన తండ్రి అయిన కేంగర్ల మల్లయ్య వద్ద ఉంటుంది. ఆమెకు మతిస్థిమితం కూడా సరిగా లేదు. తేదీ 7-10-2024న ఉదయం 8 గంటల సమయంలో పువ్వులు తీసుకొని వస్తానని ఇంట్లో నుంచి వెళ్లి ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాకపోయేసరికి, తండ్రి అయిన కేంగార్ల మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈమె ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు ఎరుపు రంగు చీర, ఎరుపు రంగు జాకెట్‌ను ధరించి ఉంది. గదవ కింది భాగంలో పచ్చబొట్టు, ఎడమ చెంపపై పులిపిరి ఉంటుంది. ఈమె ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో 8712686145, 8712666242 కామారెడ్డి పట్టణ సీఐ నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో బోధించేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

మోడల్ స్కూల్‌లో (సివిక్స్) బోధించేందుకు గానూ పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కమల్ కిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తబాది మోడల్ స్కూల్‌లో బోధించడానికి అభ్యర్థులు పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ, పీజీలో ఎమ్ఏతోపాటు బీఈడీ ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం వరకు తరగతులను బోధించడానికి ఆసక్తి గల అభ్యర్థులు 16 అక్టోబర్ 2024 ఉదయం 10 గంటలకు తమ రెజ్యూమ్, సంబంధిత సర్టిఫికెట్లతో అర్హత, అనుభవం డెమో క్లాస్ ద్వారా ఎంపికచేస్తారని తెలిపారు. ఎంపికైన పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్‌కు గౌరవ వేతనం రూ.18 వేల వరకు ఉంటుందని కొత్త బాది మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కమల్ కిషోర్ తెలిపారు.

ఐకెపి హార్వెస్టర్ లీజ్ కోసం ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ఐకేపీ కార్యాలయంలోని హార్వెస్టర్ (వరి కోత మిషన్) లీజుకు ఇవ్వనున్నట్లు మండల సమైక్య అధ్యక్షురాలు లసింగారి లక్ష్మి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరికోత మిషన్‌ను లీజుకు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల రైతులు ఐకెపి కార్యాలయంలోని ఏపీఎంను కలిసి లీజు వివరాలను తెలుసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

దుర్గమాతల శోభయాత్ర.. నిమజ్జనం

నవతెలంగాణ-సదాశివపగర్/పొతంగల్

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దుర్గమాతల శోభయాత్రను నిర్వహించారు. డీజేలను ఏర్పాటు చేసి నృత్యాలు చేస్తూ ఆటపాటలతో గ్రామాల్లోని ప్రధాన వీధులగుండా దుర్గమాతల శోభయాత్రలు నిర్వహించారు. సదాశివపగర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుంచి నందివిగ్రహం వరకు శోభయాత్ర నిర్వహించారు. మండలంలోని ధర్మారావుపేట్, కల్వరాల్, మల్లుపేట్, తుక్కోజివాడి తదితర గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు. అనంతరం దుర్గమాతను గ్రామ సమీపంలోని చెరువు, కుంటలు వాగులలో నిమజ్జనం చేశారు.

పోతంగల్ : మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున సుమారు 1.30 గంటలకు దుర్గామాతను నిమజ్జనం చేశారు. ఆదివారం సాయంత్రం 6.30 గం.లకు మొదలైన శోభయాత్ర.. మహిళల కొలాటాలతో కొలహాలంగా ఊరంతా తిరిగి, హనుమాన్ మందిరం వద్ద ఆకట్టుకునే చిన్నపిల్లల నృత్యాలు, సన్మానాలు చేయడంతో తెల్లవారు జామున నిమజ్జనం నిర్వహించారు.


సదాశివనగర్‌లో..

గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే


విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సిడిపి నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సోమవారం ప్రారంభించారు. ఈ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా.. దానిని సైతం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రజ్ఞాకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, సీనియర్ నాయకులు విట్టల్, రామ్‌పటేల్, హనుమాన్ స్వామి, వట్నాల రమేష్, సాహెబ్రావ్ సంతోష్, మేస్త్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గది నిర్మాణ దాతకు సన్మానం


నిర్మాణ దాతను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన శ్రీ రాయిపల్లి శ్రీనివాసరావు, సంతోషిని (కమ్మి టీచర్) సుమారు రెండు లక్షల రూపాయలు వెచ్చించి గది నిర్మాణం పనులు పూర్తి చేయించిన అనంతరం గదిని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారికి అందజేశారు. దాతగా ముందుకు వచ్చిన వారికి శేష వస్త్రం సమర్పించి, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి గింజుపల్లి వేణు, పరిశీలకులు బి.కమల, ఆలయ పరిచారిక శ్రీరంగం కొండమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ రఘు, ఆలయ కమిటీ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తా


చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

గ్రంథాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని లింగుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు పోగుల కవిత ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింలు, స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత లడ్డు వేలం.. రూ.41,111

- దక్కించుకున్న రామ్‌ధాల్ యూత్

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలోని దూర్గ యూత్ లడ్డు వేలం పాటలో రూ.41,111 రామ్ దళ్ యూత్ సభ్యులు దక్కించుకున్నట్టు యూత్ సభ్యులు తెలిపారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

- డిగ్రీ కళాశాలలో బంద్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు చెల్లించవలసిన ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక సోమవారం నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలను నిరవధికంగా బంద్ పాటిస్తున్నట్లు యూనియన్ బోధన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం బోధన్ పట్టణంలోని ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ డిగ్రీ కళాశాల బంద్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా ఫీజు బకాయిలు చెల్లించలేదని దాంతో కళాశాల నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. ఫీజు బకాయిలు చెల్లించే వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధికంగా బంద్ చేస్తున్నామని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు, ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేక, భవనాల అద్దెలు కట్టలేక, మున్సిపల్ టాక్స్‌లు కట్టలేక, తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఫీజు బకాయిలు చెల్లించాలని ఎన్నోసార్లు ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా.. స్పందన లేదని దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో కళాశాలలను నిరవధికంగా బంద్ చేయడానికి పిలుపు నిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, సాయిరెడ్డి జావీద్ ఉన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

- రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న పలువురు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండల కేంద్రంలోని రోడ్డు పనులు పూర్తి చేయాలని యువకులు, దుకాణ సముదాయ యజమానులు, ఆటో డ్రైవర్లు సోమవారం రాస్తారోకో చేపట్టారు. నాలుగు పలకల రోడ్డు విస్తరణ పనులో జాప్యంతో ఇబ్బందిగా మారడంతో నేడు బీర్కూర్, బాన్సువాడ రహదారిపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డుపై డస్ట్ వేసి వదిలేయడంతో దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజుకు కనీసం ఐదు సార్లు నీటి ట్యాంకర్ ద్వారా రోడ్డును తడపాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

- పశువైద్యాధికారి సంతోష్ కుమార్

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని గ్రామాలలో పశువుల సామూహిక గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమం నేటి నుంచి నెలరోజులపాటు నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ జంతువ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాలలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14వరకు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి సామూహిక గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమంలో నిర్ణయించిన తేదీల ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకుగానూ పశువులు కలిగిన రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అభినందన సభకు ఆహ్వానం

నవతెలంగాణ-మద్నూర్

2024 డీఎస్సీలో ఎంపికైన మున్నూరు కాపు విద్యార్థులకు జిల్లా శాఖ పక్షాన అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు సంఘం శాఖ సోమవారం తెలిపింది. డీఎస్సీలో సెలెక్ట్ అయిన విద్యార్థులు తమ పేరును ఏ జాబితాలో సెలెక్ట్ అయ్యారో ఫోన్ నెంబర్‌తో సహా వివరాలను ఈనెల 20లోపు పంపించాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు మామిండ్ల అంజయ్య 9949065444, ప్రధాన కార్యదర్శి పెట్టి గాడి అంజయ్య 9441631943, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ నీలం నర్సింలు 9963007364, జిల్లా మహిళా అధ్యక్షులు భాజ లలిత 9492207336, జిల్లా ట్రెజరర్ ఆకుల శ్రీనివాస్ 9440659352 తెలుపాలని సూచించారు.

గునుగు పువ్వుకు భలే గిరాకీ


ఆటోలో గునుగు పూవు తీసుకెళ్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో ఈనెల 15న జరిగే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా గునుగ పువ్వుకు భలేగిరాకీ పెరిగింది. స్థానిక చిరు వ్యాపారులు సుదూర గుట్ట ప్రాంతాల నుంచి గునుగు పువ్వును మండల కేంద్రానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. రూ.100కు కట్ట విక్రయిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు చిరు వ్యాపారులు గునుగు పువ్వును విక్రయించారు. సద్దుల బతుకమ్మ పండగకు ప్రతి ఒక్కరూ పోటీపడి మహిళలు గునుగ పువ్వులను కొనుగోలు చేశారు.

ఎల్ఆర్ఎస్ పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఇంతవరకు రెగ్యులర్ చేసుకోవడంతో జాప్యం చేయడంతో, బోధన్ డిఎల్‌పిఓ మధుకర్, ఎంపీఓ రఫీ అహ్మద్ సోమవారం పరిశీలించారు. కందకుర్తి గ్రామంలో 16 మంది లబ్ధిదారులు ఎల్ఆర్ఎస్ చేసుకోవాల్సి ఉండగా, ఇంతవరకు ఒక్కరు కూడా ముందుకు రావడం లేదని కార్యదర్శి భాస్కర్ తెలిపారు. మండలంలోని నీలా, రెంజల్, తదితర గ్రామాలలో ఎల్ఆర్ఎస్ రెగ్యులర్ చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శులు వారం రోజుల్లోపు ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలని ఆయన వారిని ఆదేశించారు. కందకుర్తి, నీలా, రెంజల్ గ్రామాలను ఆయన పర్యటించి కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట కందకుర్తి కార్యదర్శి జక్కు భాస్కర్, కారోబార్ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్త

- తొలగించాలని కోరుతున్న ప్రజలు


పేరుకుపోయిన చెత్తచెదారం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్దనున్న ఘాట్‌లో దుర్గామా తలను నిమజ్జనం చేసి పూజ సామాన్లను వదిలి వెళ్లగా.. చెత్తాచెదారంతో నిండిపో యింది. దేవాదాయ శాఖ ఘాటు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడానికి ముందుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామపంచాయతీ రికార్డులను డిఎల్‌పిఓ మధుకర్ సోమవారం పరిశీలించారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని, పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ లబ్ధిదారులకు అవగాహన కల్పించి వాటిని పూర్తిచేయాలని ఆయన గ్రామ కార్యదర్శి భాస్కర్‌ను ఆదేశించారు.